క్లుప్తంగా

ఎంబీఏ మోనిటరీ మేనేజ్‌మెంట్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : ఎంబీఏ నాల్గో సెమిస్టర్‌కు సంబంధించి మోనిటరీ మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని రచయితలు డాక్టర్ సతీష్ వాడపల్లి (అపోలో ఆసుపత్రి పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజిస్ట్), సుప్రియ మౌనిక అర్జీలు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు మాట్లాడుతూ ఇంత వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంబీఏ నాల్గో సెమిస్టర్‌కు నిర్దిష్టమైన పుస్తకం లేకపోవడంతో వారు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన సిలబస్ ప్రకారం రెండో సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. సమతా కాలేజీలో తాము చదువుకున్నప్పుడు అక్కడ లభించిన అత్యుత్తమ బోధనా సారాంశాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు. సమతా కాలేజీ చైర్మన్ సుంకర రవీంద్ర, ఆయన సతీమణి విజయా రవీంద్రలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్ ప్లాట్ ఫామ్‌లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గంటా రమేష్, ఏపీ కోటేశ్వరరావు, డాక్టర్ ఉమా నాగేశ్వరి, డాక్టర్ పి. నాగవల్లి, హైమావతి ధూళి, ఎం. సత్యవతి, కేఎస్ కుమార్, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ఏసీపీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడి హక్కులు సాధించుకుందాం



ప్రతిజ్ఞ చేస్తున్న వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

అల్లిపురం: సమష్టిగా పోరాటం చేసి హక్కులు సాధించుకుందామని సర్వే నంబర్ 1450, 1261లో గల ఇంటి యజమానులు తీర్మానించారు. ఈ మేరకు వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. తమ సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోరాడాలన్నారు. తమకు న్యాయం చేసే వారి వెంటే నడుస్తామని వెంకటేశ్వరమెట్ట ప్రజలు స్పష్టం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తమ సమస్యపై స్పందించి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని, అందుకు అతనికి మెట్ట వాసులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు..

వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ సొసైటీ గౌరవాధ్యక్షుడిగా శరగడం మోహన్‌రావు, అధ్యక్షుడిగా బొడ్డేటి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బాల సత్యారావు, చిప్పాడ సతీష్, కార్యదర్శిగా భీశెట్టి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా కణితి బ్రహ్మం, రాపేటి బాబాజీ, కోశాధికారులుగా తనకాల గోవిందరావు, శరగడం భాస్కరరావులను ఎన్నుకున్నట్లు సొసైటీ మాజీ గౌరవాధ్యక్షుడు పెంటకోట త్రినాథరావు తెలిపారు. ఇకపై కొత్త కార్యవర్గానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు, హౌస్ ఓనర్లు పాల్గొన్నారు.

అలరించిన వనితల ర్యాంప్ వాక్

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మహిళల ర్యాంప్ వాక్ అలరించింది. వీ డెంటల్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల్లో చైతన్యం కోసం శ్రావణలక్ష్మి పేరిట ఆదివారం సాయంత్రం ఈ పోటీలు నిర్వహించారు. వివాహితలతో పాటు యువతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ చీరకట్టు, పరికిణీ ఓణీల్లో సందడి చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, క్వీన్స్ ఈవెంట్స్ ఉషారాణిజ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం

- సంపూర్ణ పోషణ కిట్లతో ఆడపడుచులకు మెరుగైన ఆరోగ్యం
- చురుగ్గా అంగన్‌వాడీల ద్వారా పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న గర్భిణులు, బాలింతలు



సంపూర్ణ పోషణ కిట్‌లో గల వస్తువులు

అల్లిపురం : సంపూర్ణ పోషణ ప్లస్‌తో బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యం ప్లస్ అవుతుంది. ముఖ్యమంత్రి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం అంగన్‌వాడీల ద్వారా చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందజేయాలని సరికొత్త పథకం ప్రారంభించారు. పేదరికంతో గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందించాలని తీసుకున్న నిర్ణయం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతుంది. ఆరోగ్యవంతులైన శిశువులకు జన్మనిస్తారనే ప్రధాన ఉద్దేశంతో సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు ఈ నెల 2వ తేదీ నుంచి చురుగ్గా పంపిణీ చేస్తున్నారు.

గర్భిణులకు సంపూర్ణ పోషణ..

గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంపూర్ణ పోషణ కిట్లలో కిలో రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చెక్కీ, కిలో జొన్న పిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 3 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, అరకిలో నూనె, అరకిలో పప్పు, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో కూడిన కిట్లను అందజేస్తున్నారు. వీటన్నింటినీ డ్రై రేషన్‌గా లబ్ధిదారులకు ప్రతినెల అందజేస్తున్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం..



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ పథకం కింద అందిస్తున్న పౌష్టికాహారం కిట్లు బాగున్నాయి. ప్రభుత్వం నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేస్తోంది. గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో మేలు చేస్తాయి. సీఎం సార్‌కు ధన్యవాదాలు.

– పి.రోజా, అమ్మవారివీధి

జగనన్నకు కృతజ్ఞతలు..



మా ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగనన్న తీసుకుంటున్న శ్రద్ధకు కృతజ్ఞతలు. బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ ప్లస్ పేరిట అందిస్తున్న కిట్లు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. సొంత అక్కచెల్లెళ్లుగా మమ్మల్ని భావించిన ఆయన మా పట్ల తీసుకుంటున్న శ్రద్ధకు చాలా సంతోషంగా ఉంది.

– ఆశ శర్మ, వెంకటేశ్వరమెట్ట

పోషణ కిట్లతో మేలు..



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ కిట్లతో బాలింతలకు ఎంతో మేలు. ఈ కిట్ల ద్వారా అదనంగా ఆరు రకాల పోషక పదార్థాలు అందించి బాలింతలకు మెరుగైన ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తుండటం చూస్తుంటే ఆనందంగా ఉంది.

– పి.యశోద, అమ్మవారివీధి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ఇది నాంది..



సంపూర్ణ పోషణ ప్లస్‌తో ఆరోగ్యం మెండుగా ఉంటుందని భావిస్తున్నాం. దీని వలన గర్భిణులు, బాలింతలు రక్తహీనత నుంచి బయటపడతారు. దీని వలన ఆరోగ్యవంతులైన బిడ్డలకు జన్మనిస్తారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు ఇది నాంది అవుతుంది. సీఎం జగన్ మా కోసం చేస్తున్న ఈ మంచి కార్యక్రమానికి ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– కె.శ్వేత, చలువతోట

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



విజేతకు కానుకగా ఇస్తున్న టమాటాలు



1987-88 రైల్వేస్కూల్ విద్యార్థులు

అల్లిపురం : ప్రభుత్వ రైల్వే స్కూల్‌లో 1987–88వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలుసుకున్నారు. నగరంలోని ఒక హోటల్లో జరిగిన వేడుకల్లో ఇతర దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన వారితో పాటు నగరంలో ఉంటున్న వారంతా కలిసి ఆనందంగా గడిపారు. తమ భవిష్యత్తు సేవా కార్యక్రమాలపై చర్చించుకున్నారు. ప్రభుత్వ రైల్వే స్కూల్‌లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధితో పాటు ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రధానంగా చర్చించుకున్నారు. ఇప్పటి వరకు తాము నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్యంగా ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో జంతువుల దత్తత, మొక్కలు నాటే కార్యక్రమాలు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, హ్యాండ్ వాష్ మెటీరియల్ పంపిణీ వంటి కార్యక్రమాల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణపై తీర్మానించుకున్నారు. అనంతరం వారంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా లక్కీడిప్ నిర్వహించారు. లక్కీడిప్‌లో విజేతగా నిలిచిన ఎండీ నసీమా బేగమ్‌కు బహుమతిగా వినూత్నంగా కేజీ టమాటాలు అందజేశారు. ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుంటామని, ఆ మధుర స్మృతులను ఏడాది అంతా నెమరువేసుకుంటామని సంజీవికుమారి, ఈశ్వరీబాయి, భవానీ, బసవ శ్రీనివాస్, చామన విశ్వేశ్వరరావు, ఎం.రవీంద్ర తెలిపారు.

ఉల్లాసంగా సెయింట్ ఆంథోనీ విద్యార్థులు..

దాబాగార్డెన్స్ : వారంతా నగరంలోని మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో రెండు..మూడు దశాబ్దాల కిందట విద్య నేర్చుకున్నారు. ఆ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వీరిలో రెండు మూడు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో కలుసుకున్నారు. 1988–89 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకుంటే, 1992–93 బ్యాచ్ విద్యార్థులు విశాఖ ఆర్కేబీచ్‌లో కలుసుకున్నారు. సెయింట్ ఆంథోనీ పాఠశాల ఓ దేవాలయం వంటిదని, మరీ ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ స్కూల్ ఎంతగానో దోహదపడిందన్నారు. అప్పటి స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ పూర్వ విద్యార్థి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు బోని శ్రీనివాస్, సుకివాసి అజయ్, బలంకిల నవీన్, అడబాల శివకుమార్, రెడ్డిపల్లి సునీల్, సాయిరామ్, కన్నబాబు, సబ్బవరం రవిశంకర్, కోన ప్రకాష్, గంగరాజు, బెహరా, కందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ ఆంథోనీ స్కూల్ ఆవరణలో కలుసుకున్న 1988-89 బ్యాచ్ విద్యార్థులు

ఆత్మీయ కలయిక..

సీతమ్మధార : సీతమ్మధారలోని టీపీటీ కాలనీలో గల వసంతబాల హైస్కూల్లో 1993–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం డైమండ్ పార్కు దరి ఒక హోటల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవటంతో పాత జ్ఞాపకాలు నేమరు వేసుకుని ఆనందంగా గడిపారు. రీయూనియన్ పేరిట కలుసుకున్న పూర్వ విద్యార్థులు కేక్ కట్ చేసి సందడి చేశారు.



కలుసుకున్న వసంతబాల హైస్కూల్ పూర్వ విద్యార్థులు



ఆర్కేబీచ్‌లో కలుసుకున్న 1992-93 బ్యాచ్ సెయింట్ ఆంథోనీ విద్యార్థులు

జిమ్ నిర్మాణ పనుల పరిశీలన



జిమ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డు ఫెర్రీరోడ్డు వీధిలో రూ. కోటి వ్యయంతో రూపొందిస్తున్న జిమ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం అన్ని రంగాల వారిని ప్రోత్సహిస్తుందన్నారు. వార్డులో అనేక సంవత్సరాలుగా మూలకు చేరిన బాబులాల్ జిమ్‌ను ఆధునికీకరించి మళ్లీ అందుబాటులోకి తీసుకు వస్తున్నారన్నారు. జిమ్‌కు ముందు రూ. 50 లక్షలు నిధులు వెచ్చిస్తే, అవి చాలక మళ్లీ మరో రూ. 50 లక్షలు వెచ్చించి మహిళలు, పురుషులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అపూర్వం



సమావేశానికి హాజరైన క్లబ్ సభ్యులు

దాబాగార్డెన్స్ : లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్స్ ఆఫ్ ఎంవీపీ, పాండురంగాపురం, విశాఖ విరాజ్, విశాఖ స్మార్ట్‌సిటీ ఏరియాల వారీగా చేస్తున్న సేవలు అమోఘమని డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఇన్‌స్టాలేషన్, ఇండక్షన్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్‌క్లబ్‌లను బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరిలో ప్రేరణ కలగాలని కోరారు. ఇమ్మీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం. ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎం. త్రినాథరావు, వల్లీకుమారి, ఐఎస్ఎన్ రాజు, ఎంపాడు, శ్రీరామ్మూర్తి, శైలజ, మంజుల, శ్రీదేవి, ఎస్ఎస్ఎన్ రాజు, ప్రకాష్, ఇందిర, జానకి, రోహిణి పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాష్, నాంచారయ్య, నాగ గణేష్, రంగారావు, త్రినాథ్, భాస్కరాచారి, దుర్గాప్రసాద్, పుష్యమి, అన్వేషు, శివ, మల్లిక, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో కుక్క కరిచింది, కవితల పోటీ, జస్ట్ ఫర్ చేంజ్, హిందీ నేర్చుకునేందుకు, షాపింగ్, కుక్క తినేసింది, డిగ్రీ పోయింది, టీవీ యాంకర్, వదిన స్కిట్లు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి, బాందంగీర్ సాయి తదితరుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా సంస్కృత భాష శోభాయాత్ర

బీచ్ రోడ్డు: సంస్కృత భాష ప్రచారంలో భాగంగా ఆదివారం సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సాగరతీరంలో శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృత భాష శిబిరాలు, బాల సంస్కార కేంద్రాలు, సంస్కృత పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రాలను ఈ శోభయాత్రలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతీ ప్రాంతీయ కార్యదర్శి రాంకుమార్, జనపద అధ్యక్షుడు సుందరరాజ్ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ప్రభుత్వ సలహాదారు శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార : ఆశీలుమెట్ట వేమన మందిరంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గాదె శ్రీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆయనను సత్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అందరు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో వేమన మందిరం గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్తి రామకృష్ణరెడ్డి (గౌతమి), కోర్ కమిటీ నీలాపు రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోర కుమార్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, వేమన కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయానికి భక్తుల తాకిడి



ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణమాస శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఎర్నిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కుటుంబ సభ్యులతోను, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరల సీఎంగా గెలవాలన్నారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విందులో వివిధ శాఖల చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్షణం జీవో 21ని రద్దు చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

సీతమ్మధార : ఆటో, మోటారు కార్మికులపై అధిక జరిమానాలు విధించే జీవో 21ని తక్షణం రద్దు చేయాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మోటారు రంగ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాప్పుబాబు మాట్లాడుతూ ఆటోరంగ కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన ఆటో డ్రైవర్‌కు రూ. 10 లక్షలు, సహజంగా మరణిస్తే రూ. 5 లక్షలు, ఉచిత ఇన్స్యూరెన్స్ పాలసీని ప్రభుత్వం వర్తింపజేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమాదాల నివారణ పేరుతో జీవో నెంబర్ 21ని తీసుకురావడం ఆటో, మోటార్ రంగ కార్మికుల పీకకు ఉరి తగిలించినట్లు మారిందని వాపోయారు. తక్షణం ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.రమణ, ఎర్రయ్య, గోపి, వెంకట్, పి.రాజు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

చుండూరు హంతకులను శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలియజేస్తున్న దళిత విముక్తి ప్రతినిధులు

సీతమ్మధార : చుండూరు హంతకులను శిక్షించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దళిత విముక్తి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 32 ఏళ్లయినా చుండూరు దళితుల హత్యాకాండలో బాధితులకు న్యాయం జరగలేదని వాపోయారు. ఈ సందర్భంగా దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, దళిత హక్కుల సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరులో దళితులపై మారణకాండకు పాల్పడి ఎనిమిది మందిని హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత పాక్షిక న్యాయమే జరిగిందన్నారు. దేశంలో అనేక కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా పరిష్కరిస్తున్నారని, దళితుల కేసులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బంకపల్లి అప్పారావు, రామకృష్ణ, బి.సన్యాసిరావు, కె.కుమార్, వీఎస్ కృష్ణ, హుస్సేన్, రాంప్రభు, గురవయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్న కార్మిక నాయకులు

సీతమ్మధార : ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుందామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు నమ్మి రమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు 857వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీను, వి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

యాత కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

దాబాగార్డెన్స్ : అత్యంత వెనుకబడిన యాత కులస్తులను ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించాలని, అట్రాసిటీ యాక్ట్ వర్తింపజేయాలని ఉత్తరాంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని జడ్జి కోర్టు సమీపాన గల సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో సుమారు 4 లక్షల మంది యాత కులస్తులున్నారని, వారందర్నీ ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో వివక్షకు గురవుతున్న అత్యంత వెనుకబడిన 32 కులాలకు అట్రాసిటీ యాక్ట్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణులను ఎవరైనా కించపరచినా, కులవివక్ష చూపినా శిక్షించేలా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో ఇతర ఎంబీసీ కులాలకు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వడిశల సూరిబాబు, గెద్దాడ రమేష్, కడవల ఈశ్వరరావు, నాయుడు, అండిబోయిన సన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

దాబాగార్డెన్స్ : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 41వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. సుమారు 350 మంది వధూవరులు పాల్గొని వారి జీవిత భాగస్వామిని ఎంచుకున్నారని సంఘం కార్యదర్శి పూసర్ల రమేష్ తెలిపారు. మరో ప్రతినిధి పీఎస్ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇంటర్నెట్ యుగంలో నెట్ ద్వారా పెండ్లి సంబంధాలు కుదుర్చుకుంటున్న సమయంలో కూడా సాంప్రదాయ పద్ధతిలో పెండ్లి చూపుల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజుల కాలంలో కూడా స్వయంవరాల ద్వారా కేవలం అమ్మాయిలకు మాత్రమే పెండ్లి కొడుకును ఎంచుకునే అవకాశం కల్పించేవారని, అబ్బాయిలకు ఆ విధంగా అవకాశాలు కల్పించిన దాఖలాల్లేవన్నారు. కానీ ఇప్పుడు..అమ్మాయి, అబ్బాయిలకు కూడా జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఈ ఆధునిక స్వయంవరాల్లో కలగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కంకటాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ కంకటాల అనిరుధ్, నల్లూరి నూకరాజు, దుర్గా సోమేశ్వరరావు, గ్రంధి దుర్గాప్రసాద్, యలమర్తి గణేష్, విన్నకోట రామ్మూర్తి, సుగ్గు శివకుమార్, అరిశెట్టి దినకర్, పాలూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.